## పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

**కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, మే 23 : ఈ నెల 25వ తేదీన గ్రామ పాలనాధికారుల నియామక ఎంపిక పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామ పాలనాధికారుల పరీక్ష నిర్వహణకు ఇన్విజిలేటర్స్, పలువురు అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదివారం పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 402 మంది పరీక్ష రాస్తున్నట్లు చెప్పారు. గతంలో వీఆర్వో, వీఆర్ఏలుగా పనిచేసిన వారు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలు, గుర్తింపు కార్డు వెంట తీసుకొని రావాలని సూచించారు. ఉదయం 10 గంటలకు మెయిన్ గేట్ మూసి వేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, అదనపు ఎస్పీ చైతన్య, ఆర్డీవో వీణ, చీఫ్ సూపరింటెండెంట్ విశ్వప్రసాద్, పరిశీలకులు శంకర్, జిల్లా విద్యాశాఖాధికారి రాజు, ఇన్విజిలేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలికేందుకు తరలిన నాయకులు


ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలికేందుకు వెళ్లిన నాయకులు

బాన్సువాడ, మే 23 : ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్సీ కవిత అమెరికా పర్యటన ముగించుకొని హైదరాబాద్‌కు చేరుకున్న నేపథ్యంలో శుక్రవారం బాన్సువాడ నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో షేక్ జుబేర్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. వెళ్లిన వారిలో ఎర్రవట్టి సాయిబాబా, రమేశ్ యాదవ్, సంజయ్‌యాదవ్, మోచి గణేశ్, నర్సింహులు గౌడ్, ఆరిఫ్, నవీన్, సాయిలు, అఫ్రోజ్, బోడ రాంచందర్ తదితరులు ఉన్నారు.

## నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలి

బీబీపేట్(దోమకొండ), మే 23 : నాణ్యమైన విత్తనాలను రైతుల కోసం అందుబాటులో ఉంచాలని ఏవో మణిదీపిక అన్నారు. దోమకొండలోని పలు ప్రైవేట్ విత్తన దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డీలర్లు స్టాక్ ఎంట్రీ కోసం రిజిస్టర్లను నిర్వహించాలన్నారు. రైతులకు విత్తనాలు విక్రయించిన వెంటనే రశీదును ఇవ్వాలన్నారు. నాణ్యమైన పత్తి విత్తనాలనే రైతులకు విక్రయించాలన్నారు. రైతులు ప్యాకింగ్ లేని విత్తనాలు కొనొద్దని, లైసెన్స్ పొందిన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని ఆమె సూచించారు.

# మురికికాలువ నిర్మాణానికి నిధులు లేవా?

- చిన్నపాటి వర్షానికే ఇండ్లలోకి చేరుతున్న వర్షపునీరు
- రాత్రంతా తండావాసుల జాగారం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న తిమ్మారెడ్డి తండా వాసులు


వర్షపునీరు ఇండ్లలోకి రాకుండా ఏర్పాటు చేసుకున్న మట్టికట్ట


తిమ్మాపూర్ తండాలో మురికికాలువలు లేకపోవడంతో నిలిచిపోయిన వర్షపునీరు

ఎల్లారెడ్డి రూరల్, మే 23 : గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి మురికికాలువలు నిర్మిస్తున్నామని, సీసీ రోడ్లు వేస్తున్నామని ఉత్తర కుమార ప్రగల్బాలు పలుకుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద మూడు వందల మీటర్ల మురికికాలువ నిర్మాణానికి నిధులు లేవా?.. అని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. మండలంలోని తిమ్మారెడ్డితండాలో మురికి కాలువ నిర్మాణం గురించి స్వయంగా ఎమ్మెల్యేకు పరిస్థితిని చూయించినా తమ సమస్యను పరిష్కరించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తండాలో మొత్తం 56 నివాస గృహాలు ఉన్నాయి. ప్రధాన రహదారి వాటర్‌ట్యాంకు నుంచి భవానీ సేవాలాల్ ఆలయం వరకు ఉంది. ఈ రహదారిపై సీసీ రోడ్డును వేయడంతో రోడ్డుకు పక్కన ఉన్న గృహాలు లోతట్టుగా మారిపోయాయి. దీనికి తోడు మురికికాలువలు సరిగ్గా లేకపోవడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. రెండేండ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాటర్‌ట్యాంకు నుంచి కొద్దిమేరకు మురికి కాలువను నిర్మించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో తండాలోని మురికికాలువ నిర్మాణాన్ని పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. తండాలోని భవానీ సేవాలాల్ ఆలయం వరకు 300 మీటర్లు మాత్రమే మురికి కాలువ నిర్మాణం చేపడితే సమస్య తీర్చినట్లవుతుందని వారు తెలిపారు. ఈ విషయమై ఎమ్మెల్యే, స్థానిక నాయకులకు పలుమార్లు తెలిపినా, సంబంధిత అధికారులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా, పంచాయతీ కార్యదర్శికి పరిస్థితి తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. మూడు నెలల క్రితం మురికి కాలువ నిర్మాణానికి సంబంధిత ఏఈ ఐదు లక్షల మేర మురికికాలువ నిర్మాణానికి ప్రపోజల్ కూడా సిద్ధం చేసినట్లు వారు తెలిపారు. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇండ్లలోకి వర్షపునీటితోపాటు కప్పలు వచ్చాయని, వాటితోపాటు విషప్రాణులు వస్తే ఇండ్లలోని పిల్లలు, పెద్దల పరిస్థితి ఏంటని తండా వాసులు ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులుకానీ తమ తండాలో 300 మీటర్ల మేరకు మురికి కాలువ నిర్మించి తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

**మురికికాలువ నిర్మించండి**



వర్షాకాలం వస్తుందంటేనే భయమేస్తున్నది. ఎమ్మెల్యే, నాయకులు, అధికారులకు దండం పెడుతున్నానని, మా తండాలో 300 మీటర్ల మేరకు ఉన్న మురికి కాలువను నిర్మించండి. దయచేసి మా తండా సమస్యను పరిష్కరించాలని నాయకులు, అధికారులకు మరొక్కసారి వేడుకుంటున్నా.

**- కోల సంతోష్‌కుమార్, తిమ్మారెడ్డి తండా వాసి**

## పెద్దమ్మకు బోనాలు సమర్పణ


లింగంపేటలో బోనాలు ఊరేగిస్తున్న మహిళలు

లింగంపేట, మే 23 : మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం సభ్యులు పెద్దమ్మకు శుక్రవారం బోనాల సమర్పించారు. పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ నిర్వహించారు. మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం మహిళలు బోనాలను అలంకరించి ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. బోనాలను పెద్దమ్మ ఆలయంలో సమర్పించి పూజ కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

## సాంబార్‌లో పడిన చిన్నారి మృతి


మధుర సాత్విక్

లింగంపేట, మే 23 : మండలంలోని కొండాపూర్ తండాకు చెందిన మధుర సాత్విక్(2) చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గాంధారి మండలం గౌరారం తండాలో వివాహ వేడుకలకు సాత్విక్ తల్లిదండ్రులు రాజ్‌కుమార్, లలిత వెళ్లారు. సాత్విక్ బుధవారం సాయంత్రం ఆడుకుంటూ వెళ్లి సాంబార్ పాత్రలో పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. సాత్విక్‌ను కుటుంబ సభ్యులు, బంధువుల, హుటాహుటిన చికిత్స నిమిత్తం నిజామాబాద్ నగరంలోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సాత్విక్ మృతి చెందడంతో కొండాపూర్ తండాలో విషాదం నెలకొంది.

## విద్యార్థులకు ఆధునిక బోధనలు చేయాలి


ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న విద్యాశాఖ అధికారులు

కామారెడ్డి, మే 23 : జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఆధునిక బోధన విధానాలను అనుసరించి పాఠాలు బోధించాలని సూచించారు. సృజనాత్మకతను ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు తయారు చేసిన అభ్యసన సామగ్రిని పరిశీలించి, ఉత్తమమైన ప్రయత్నాలను ప్రశంసిస్తూ బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయుల్లో సృజనాత్మకతను వెలికితీయడంలో పేపర్ ఫోల్డింగ్ విధానం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. శిక్షణ శిబిరంలో ఇన్‌చార్జి నరహరి రాజు, తెలంగాణ గణిత ఫోరం అధ్యక్షుడు తాడ్వాయి శ్రీనివాస్, రామారావు, కుమారస్వామి, శ్రీనివాస్, గోవర్ధన్, వేణుగోపాల్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ


బాన్సువాడలో జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, మే 23 : బాన్సువాడ పీఏసీఎస్ ఆవరణలో 50 శాతం సబ్సిడీపై అందిస్తున్న జీలుగ విత్తనాలను రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. జీలుగ విత్తనాలు 30 కిలోల బస్తా ధర రూ.4,275 ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో రూ.2,137.50లకు అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర సేవల ఆకస్మిక తనిఖీ


అత్యవసర సేవల 108 పనితీరును తనిఖీలు చేస్తున్న అధికారులు

కామారెడ్డి, మే 23 : జిల్లాలో 108 అత్యవసర సేవల పనితీరును తెలుసుకోవడానికి రాష్ట్ర హెడ్ హెచ్‌ఆర్ కిరణ్ కిశోర్, హెచ్‌ఆర్ రవీందర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. 108, 102 సేవల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సిబ్బందిని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్, జిల్లా మేనేజర్ తిరుపతి, సిబ్బంది స్వామి, అనిల్, విజయ్, కృష్ణ, స్వామి, కార్తిక్, సురేశ్‌లు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య


బిచ్కుంద(జుక్కల్), మే 23 : జుక్కల్ మండలంలోని కౌలాస్ గ్రామంలో ఉన్న కౌలాస్ కోటలో చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు జుక్కల్ ఎస్సై భువనేశ్వర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని డోన్‌గావ్ గ్రామానికి చెందిన కారె బస్వరాజ్(50) మద్యానికి బానిసై జీవితం మీద విరక్తి చెంది మండలంలోని కౌలాస్ గ్రామంలోని కౌలాస్ కోటలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసున్నాడు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## జీలుగ, పెద్ద జనుము విత్తనాలు సరఫరా చేయాలి


మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రావు

రామారెడ్డి(సదాశివనగర్), మే 23 : రైతులకు వెంటనే సహకార సంఘాల ద్వార జీలుగ, పెద్ద జనుము విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేయాలని ఉమ్మడి సదాశివనగర్ మాజీ జడ్పీటీసీ పడిగేల రాజేశ్వర్‌రావు శుక్రవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిజామాబాద్ జిల్లాలో సహకార సంఘాల ద్వారా రైతులకు విత్తనాలను అందుబాటులో ఉంచారని తెలిపారు. రైతు ప్రభుత్వమని చెప్పుకునే కాంగ్రెస్ జీలుగ, జనుము విత్తనాల రేట్లను పెంచి రైతుల నడ్డి విరుస్తున్నదని అన్నారు. గతంలో జీలుగ ఒక బస్తాకు రూ.1,116 ఉండగా, ప్రస్తుతం రూ.2,137, పెద్ద జనుము బస్తాకు గతంలో రూ.1,448 ఉండగా ప్రస్తుతం రూ.2,510 పెంచారని ఆయన విమర్శించారు. పెంచిన రేట్లను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. సన్న వడ్లను కొనుగోలు చేసిన ప్రభుత్వం వెంటనే రైతులకు బోనస్ చెల్లించాలన్నారు. విత్తనాలను సరఫరా చేయాలని, లేని పక్షంలో రైతుల పక్షాన ఆందోళన చేయాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీసీ నాయకుడు కలాలీ సాయాగౌడ్, మాజీ యూత్ అధ్యక్షుడు శివకుమార్, బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## బైక్‌లను ఢీకొన్న కారు


ధ్వంసమైన బైక్‌లు

మాచారెడ్డి, మే 23 : మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌లో ఆగి ఉన్న బైక్‌లను కారు ఢీకొట్టింది. ఈ ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేస్త్రీ కూలీలు ఓ హోటల్ వద్ద చాయ్ తాగుతున్నారు. నాందేడ్ నుంచి రాత్రి ఒంటి గంటకు వేములవాడకు కారులో బయల్దేరిన మహారాష్ట్ర వాసులు డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా ఇద్దరు వ్యక్తులతోపాటు ఆరు బైక్‌లను ఢీకొట్టాడు. ఇద్దరు వ్యక్తులకు గాయాలు కాగా వారిని అంబులెన్స్‌లో కామారెడ్డి దవాఖానకు తరలించారు.

## బైక్ పైనుంచి పడి మహిళ మృతి

బిచ్కుంద, మే 23 : మండల కేంద్రంలోని పిడుగు మైసమ్మ గుడివద్ద బైక్ పైనుంచి పడి మహిళ మృతి చెందినట్లు ఎస్సై మోహన్ రెడ్డి తెలిపారు. ఎస్సై, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జుక్కల్ మండలంలోని బాబుల్‌గాం గ్రామానికి చెందిన మంగళి సునీల్ కొంతకాలంగా బిచ్కుందలో జీవనం కొనసాగిస్తున్నాడు. తన భార్య జ్యోతితో కలిసి మద్నూర్ మండలంలోని పెద్ద తడ్గూర్ గ్రామంలో ఉన్న అత్తగారి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం తిరుగు ప్రయాణంలో బిచ్కుందకు వస్తుండగా బిచ్కుంద శివారులోని పిడుగు మైసమ్మ గుడి వద్ద సునీల్ బైక్‌ను నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా నడపడంతో జ్యోతి బైక్ పైనుంచి కింద పడింది. దీంతో తలకు బలమైన గాయం కావడంతో ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతదేహాన్ని మండల కేంద్రానికి తీసుకరావడంతో గమనించిన సునీల్.. భార్య మృతి చెందిన విషయం తట్టుకోలేక యాసిడ్ తాగాడని స్థానికులు తెలిపారు. గమనించిన స్థానికులు హుటాహుటిన అంబులెన్స్‌లో నిజామాబాద్ దవాఖానకు తరలించారు. శుక్ర వారం రాత్రి సునిల్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. జ్యోతి తల్లి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలి

**కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

భిక్కనూరు, మే 23 : ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. భిక్కనూరు మండలం జంగంపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని త్వరగా తూకం వేసి రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 446 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 70,358 మంది రైతుల నుంచి రూ.851 కోట్ల విలువైన 3.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. దీంట్లో 1.88 మెట్రిక్ టన్నులు దొడ్డు రకం, 1.78 లక్షల టన్నుల సన్నరకం ధాన్యం కొనుగోలు చేశామని, ఇప్పటివరకు 56,544 మంది రైతులకు రూ.762.99 కోట్ల చెల్లింపులు కూడా పూర్తయ్యాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని తగినన్ని టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని మార్కెటింగ్ శాఖ వారికి సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ పౌర సరఫరాల అధికారి మల్లికార్జున బాబు, డీసీవో రామ్మోహన్ సంబంధిత అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**ఇండ్లు నిర్మించుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలి**

కామారెడ్డి, మే 23 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా నిర్మించుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామానికి చెందిన కుంట్ల వినోదకు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రెండు దశల్లో 11,153 ఇండ్లు మంజూరయ్యాయని తెలిపారు. 2,250 ఇండ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకురాగా ముగ్గు పోసినట్లు తెలిపారు. త్వరగా ఇంటిని నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం ఇండ్ల నిర్మాణ పత్రాన్ని లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ్ పాల్ రెడ్డి, వార్డు ఆఫీసర్, ప్రజలు పాల్గొన్నారు.

**కొనుగోలు కేంద్రం పరిశీలన**

రామారెడ్డి (సదాశివనగర్), మే 23 : సదాశివనగర్ మండలం కుప్రియాల్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ విక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. ధాన్యాన్ని త్వరగా తూకం వేయాలని, వర్షం కురుస్తున్న సమయంలో టార్పాలిన్లు కప్పాలని కేంద్రం నిర్వాహకుడు సీసీ అంజయ్యకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ గంగాసాగర్, ఐకేపీ ఏపీఎం రాజిరెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

**జుక్కల్ మండలంలోని పెద్దఏడ్గిలో..**

బిచ్కుంద(జుక్కల్), మే 23 : జుక్కల్ మండలంలోని పెద్దఏడ్గి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ మహేందర్ పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. రైతులు అధైర్య పడొద్దని, ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఎక్కడా కూడా సమస్య రాకుండా చూసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రామారావు, ఐకేపీ అధికారులు, రైతులు ఉన్నారు.

## పూర్వ విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ

లింగంపేట(తాడ్వాయి), మే 23 : తాడ్వాయి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులకు వృత్తి నైపుణ్యంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సురేఖ తెలిపారు. గురుకుల కళాశాలలో చదివి ఎలాంటి ఉపాధి అవకాశాలు పొందని వారు అర్హులని తెలిపారు. వృత్తి నైపుణ్యంపై శిక్షణ ఇచ్చి ఉపాధి పొందేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. గురుకుల పాఠశాలలో 2017 సంవత్సరం నుంచి చదువుకున్న విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 19 నుంచి 25 ఏండ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థ సహకారంతో వృత్తి నైపుణ్యంపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు.

## మలిదశ ఉద్యమకారులు భారీగా తరలిరావాలి

బాన్సువాడ, మే 23 : హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 25న నిర్వహించే మలిదశ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశానికి బాన్సువాడ నియోజకవర్గంలోని మలిదశ ఉద్యమకారులు భారీగా తరలిరావాలని మలిదశ ఉద్యమకారులు గంగాధర్, చందు కోరారు. బాన్సువాడలోని గెస్ట్ హౌస్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మలిదశ ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ అధ్యక్షత సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వడ్ల మారుతి, బూరిగారి మహేశ్, రాజు, భాస్కర్ గౌడ్, కృష్ణ, గంగారాం, పవన్, సురేశ్, బాబూరావు, వడ్ల వెంకటి తదితరులు పాల్గొన్నారు.

## గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న షీటీం సభ్యుడు శ్రీనివాస్

ఎల్లారెడ్డి రూరల్, మే 23 : విద్యార్థులకు గుడ్ టచ్ – బ్యాడ్‌టచ్‌పై ఉపాధ్యాయులు స్పష్టమైన అవగాహన కల్పించాలని షీటీం సభ్యుడు శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయుల శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో ఇంటికి వెళ్లినప్పుడు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళల కోసం ఎల్లవేళలా షీటీం సభ్యులు అందుబాటులో ఉంటారన్నారు. ఏమైనా సమస్యలు వచ్చినప్పుడు షీటీం నంబర్ 8712686094, సైబర్ నేరాలపై 1930 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. సైబర్ మోసాలు, షీటీం పనితీరుపై పలు విషయాలను వివరించారు. వాహనాలు నడిపేవారు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని మానుకోవాలన్నారు. ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండడంతోపాటు ఈ విషయాలను ఇంట్లో పిల్లలు, చుట్టు పక్కలవారికి, పాఠశాలల్లో విద్యార్థులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రాజు, ఆర్పీలు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడిని అభినందించిన ఎంఈవో

లింగంపేట, మే 23 : లింగంపేట మండలం నల్లమడుగు ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను మండల విద్యాశాఖ అధికారి షౌకత్ అలీ శుక్రవారం అభినందించారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో పోరు తెలంగాణ జానపద గేయాన్ని రచించి ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులకు తెలంగాణ యాసపై అవగాహన కలిగి ఉంటారని, అదే యాసలో విద్యా బోధన చేయడంతో సులభతరంగా అర్థం అవుతుందన్నారు. విద్యా బోధనలో జానపద కళాకృత్యాలు ఉపయోగపడుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలి


ఇండ్లను పరిశీలిస్తున్న టీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, అధికారులు, నాయకలు

బీబీపేట్(దోమకొండ)/పెద్దకొడప్‌గల్/రాజంపేట్, మే 23 : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని టీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. దోమకొండలోని ఇందిరమ్మ ఇండ్లకు శుక్రవారం మార్కింగ్ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మండల ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. రాజంపేట మండల ఎల్లారెడ్డి నియోజక పరిధిలోని ఆర్గొండ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసి, ముగ్గు పోసినట్లు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు విజయ్‌రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జీజీహెచ్ దవాఖాన అసిస్టెంట్ డైరెక్టర్ అడ్మిన్‌గా రవికుమార్


డాక్టర్ రవికుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

కామారెడ్డి, మే 23 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానకు కొత్తగూడెం నుంచి ఉద్యోగోన్నతిపై వచ్చిన అసిస్టెంట్ డైరెక్టర్ అడ్మిన్‌గా డాక్టర్ రవికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా దవాఖాన సిబ్బంది ఆయనను శాలువా, పూల బొకేతో సత్కరించారు. కార్యక్రమంలో జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బన్సీలాల్, ఏవో రఘురాం, ఆర్ఎంవో డాక్టర్ సంతోష్, డాక్టర్ యాదగిరి, ఆఫీస్ సూపరింటెండెంట్ మారుతి, ప్రవీణ్ పాల్గొన్నారు.

## ధాన్యం లారీ బోల్తా

లింగంపేట, మే 23 : లింగంపేట మండలం బూరుగిద్ద గ్రామ సమీపంలో ధాన్యం లారీ శుక్రవారం బోల్తా పడినట్లు గ్రామస్తులు తెలిపారు. మండలంలోని ఐలాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం తాడ్వాయి మండలం చిట్యాల గ్రామంలోని రైస్‌మిల్‌కు తరలిస్తుండగా కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై బోల్తా పడినట్లు తెలిపారు. లారీ టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి బోల్తా పడ్డట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు.